రేపు మీర్‌పేట్‌కు గవర్నర్ రాక

సరూర్‌నగర్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ శుక్రవారం ఉదయం 11 గంటలకు మీర్‌పేట్‌కు విచ్చేయనున్నారు. ఇక్కడి ప్రశాంతిహిల్స్‌లోని శ్రీద్వారకామయిసాయిబాబా పీఠాన్ని ఆమె సందర్శించుకోనున్నారు. పీఠాధిపతి శ్రీగోపాలకృష్ణానందస్వామి విరచిత రహస్య తత్వార్థ బోధలు, శ్రీఆదిత్య హృదయం అనే రెండు గ్రంథాలను గవర్నర్ ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీ పార్థసారథిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ జానకి తదితరులు హాజరుకానున్నట్టు స్వామి తెలిపారు.

మహిళల భద్రత, శాంతి

భద్రతలకు అధిక ప్రాధాన్యం

● రాచకొండ సీపీగా బాధ్యతలు స్వీకరించిన తరుణ్ జోషి


బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ తరుణ్‌జోషి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మహిళల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు రాచకొండ పోలీస్ కమిషనర్ డా.తరుణ్ జోషి. రాచకొండ నూతన సీపీగా నియమితులైన ఆయన బుధవారం నేరేడ్‌మెట్‌లోని రాచకొండ కమిషనరేట్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం డీసీపీలు, ఏసీపీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. యాక్సిడెంట్స్‌ను గణనీయంగా తగ్గించడంతోపాటు.. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సివిల్, ఏఆర్, ట్రాఫిక్, బెటాలియన్ వంటి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. మహిళా సంరక్షణకు కట్టుబడి ఉన్నామన్నారు. అందుకు అనుగుణంగా షీటీమ్స్ పనితీరు ఉండాలని సూచించారు. రాష్ట్రాన్ని డ్రగ్స్ ఫ్రీ రాష్ట్రంగా తయారు చేయాలని ప్రభుత్వం సంకల్పించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలని అధికారులను సీపీ ఆదేశించారు. గతంలో రాచకొండ జాయింట్ సీపీగా, అడిషనల్ సీపీగా పనిచేసిన అనుభవం ఉండటంతో సమస్యలు, నేరాలపై అవగాహన ఉందన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి నేరాల అదుపుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో యాదాద్రి డీసీపీ రాజేష్ చంద్ర, మల్కాజిగిరి డీసీపీ పద్మజ, ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్, డీసీపీ ఎస్‌బీ కరుణాకర్, అడ్మిన్ డీసీపీ ఇందిర, ఎస్‌వోటీ డీసీపీ మురళీధర్, ఏసీపీలు పాల్గొన్నారు.

వనస్థలిపురం ఏసీపీగా కాశీరెడ్డి



వనస్థలిపురం, ఫిబ్రవరి 14(ఆంధ్ర జ్యోతి): వనస్థలిపురం నూతన ఏసీపీగా పి.కాశీరెడ్డి బుధవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఏసీపీగా విధులు నిర్వహించిన భీమ్‌రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఏసీపీ కాశీరెడ్డి మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా కాశీరెడ్డికి పలువురు ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



● వనస్థలిపురం ఏసీపీ పి.కాశీరెడ్డిని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. - (అబ్దుల్లాపూర్ మెట్, ఆంధ్రజ్యోతి)

బడంగ్‌పేట్, మీర్‌పేట్ కమిషనర్ల బదిలీ

● కొత్త కమిషనర్లుగా రఘు, చంద్రశేఖర్

సరూర్‌నగర్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్ల కమిషనర్లు బదిలీ అయ్యారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు బదిలీపై వచ్చిన బడంగ్‌పేట్ కమిషనర్ బి.సుమన్‌రావును ప్రస్తుత ఎంపీ ఎన్నికల దృష్ట్యా శంషాబాద్‌కు, మీర్‌పేట్ కమిషనర్ ఎ.వాణీరెడ్డిని తుర్కయాంజాల్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వారి స్థానంలో బడంగ్‌పేట్ కమిషనర్‌గా కొత్తగూడెం కమిషనర్ జి.రఘును, మీర్‌పేట్ కమిషనర్‌గా జీహెచ్‌ఎంసీలోని మెహిదీపట్నం డిప్యూటీ కమిషనర్ బి.చంద్రశేఖర్‌ను నియమించారు. మీర్‌పేట్ కమిషనర్ వాణీరెడ్డి బుధవారమే రిలీవ్ కాగా, ఆ వెంటనే ఆమె స్థానంలో చంద్రశేఖర్ బాధ్యతలు స్వీకరించారు. ఇక బడంగ్‌పేట్ కమిషనర్ సుమన్‌రావు గురువారం రిలీవ్ కానుండగా కొత్త కమిషనర్ రఘు శుక్రవారం బాధ్యతలు చేపట్టనున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి.

హయత్‌నగర్ తహసీల్దార్‌గా జానకి


హయత్‌నగర్ తహసీల్దార్‌గా బాధ్యతలు తీసుకుంటున్న జానకి

హయత్‌నగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న బి.సునీత ఇబ్రహీంపట్నం తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో కొత్తూరులో పనిచేస్తున్న తహసీల్దార్ కె.జానకి హయత్‌నగర్‌కు బదిలీపై వచ్చారు. బుధవారం తహసీల్దార్ జానకి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ భూముల రక్షణ కోసం పకడ్బందీగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. అనంతరం సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

తుర్కయంజాల్ కమిషనర్‌గా వాణి


ఎ.వాణి

హయత్‌నగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమిషనర్ శ్రీకాంత్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మీర్‌పేట్ కమిషనర్ ఎ.వాణి తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమిషనర్‌గా బదిలీపై వచ్చారు. గత సంవత్సరం జూలై 20న ఖమ్మం జిల్లా మధిర నుంచి శ్రీకాంత్ తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. సుమారు 7 నెలలు పని చేసిన ఆయన పెద్దపల్లి జిల్లా రామగుండం కమిషనర్‌గా బదిలీ అయ్యారు. రెండు సంవత్సరాలుగా తుర్కయంజాల్ మున్సిపాలిటీకి వస్తున్న కమిషనర్లు పట్టుమని పది నెలలు కూడా పని చేయకుండానే బదిలీలపై వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. నూతన కమిషనర్ వాణి గురువారం బాధ్యతలు తీసుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

అబ్దుల్లాపూర్‌మెట్ ఎంపీడీవోగా శ్రీవాణి



అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిషత్ అభివృద్ధి అధికారిణిగా యు.శ్రీవాణి బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పని చేసిన మమతాభాయ్ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని శామీర్‌పేట మండలానికి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలాభివృద్ధి అధికారిణిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ సందర్భంగా శ్రీవాణి మాట్లాడుతూ మండలాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

'ఉస్మానియా' రక్షణకు వారసత్వ

పరిరక్షణ కమిటీ వేయాలి

- ఉస్మానియా ప్రభుత్వ ఆస్పత్రి పరిరక్షణ గ్రూపు ప్రతినిధులు

పంజాగుట్ట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా ఆస్పత్రి రక్షణకు వారసత్వ పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేయాలని, జీవో 313ని అమలు చేయాలని ఉస్మానియా ప్రభుత్వ ఆస్పత్రి పరిరక్షణ గ్రూపు ప్రతినిధులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఆస్పత్రిని పరిరక్షించాలని అన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రూపు ప్రతినిధులు అనురాధ రెడ్డి, డాక్టర్ జస్వీన్ జైరత్, సారా మాథ్యూస్, డాక్టర్ ఇక్బాల్ జావీద్, డాక్టర్ ఆసీఫ్ హనీఫ్ మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న భవనానికి మరమ్మతులు చేపట్టి వైద్య సేవలు కొనసాగించాలన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి స్పందించి ప్రస్తుతం ఉన్న ఆస్పత్రి భవనాన్ని అలానే ఉంచి, ఖాళీగా ఉన్న ప్రదేశంలో అధునాతన వసతులతో కొత్త భవనం నిర్మించాలని వారు సూచించారు. ఈ సమావేశంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌వోల కోసం పైరవీలు

● నేతల ఆశీస్సుల కోసం ఖాకీల ఆరాటం ● బదిలీల కోసం పట్టుబడుతున్న అధికార పార్టీ నేతలు



ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంపు కార్యాలయం

దిల్‌సుఖ్‌నగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారడంతో అన్ని శాఖల్లో ఉద్యోగుల బదిలీలు సాధారణంగా జరుగుతుంటాయి. గత ప్రభుత్వంలో కీలక పదవుల్లో పనిచేసిన అధికారులను బదిలీ చేసి తమకు అనుకూలంగా ఉన్న వారికి పోస్టింగ్‌లు ఇప్పించుకునేందుకు అధికార పార్టీ నేతలు మొగ్గు చూపుతారు. ఈ నేపథ్యంలో అధికార పార్టీ పెద్దల ఆశీస్సులతో ఎల్బీనగర్ జోన్ పరిధిలోని పోలీస్‌స్టేషన్ల ఎస్‌హెచ్‌వో పోస్టింగ్‌ల కోసం కొందరు ప్రయత్నిస్తున్నారు. జోన్ పరిధిలో ఎల్బీనగర్, వనస్థలిపురం డివిజన్లున్నాయి. ఎల్బీనగర్ డివిజన్‌లో సరూర్‌నగర్, చైతన్యపురి, ఎల్బీనగర్, నాగోల్ స్టేషన్లు, వనస్థలిపురం డివిజన్‌లో వనస్థలిపురం, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ స్టేషన్లున్నాయి. వీటిలో పోస్టింగ్‌లు సాధించడంలో ఇప్పటికే కొందరు సఫలం కాగా, మరికొందరు అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. చైతన్యపురి ఇన్‌స్పెక్టర్‌గా జి.వెంకటేశ్వర్లు, నాగోల్ ఇన్‌స్పెక్టర్‌గా పరమేశ్వర్, వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్‌గా రవికుమార్, అబ్దుల్లాపూర్‌మెట్ ఇన్‌స్పెక్టర్‌గా సైదయ్యలు పోస్టింగ్ సాధించారు.

ఆ మూడు కోసం పోటాపోటీ..!

సరూర్‌నగర్, ఎల్బీనగర్, హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ల ఎస్‌హెచ్‌వోల కోసం పైరవీలు జోరందుకున్నాయి. హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లును వారం రోజుల క్రితమే మహేశ్వరానికి బదిలీ చేసినా కొత్త ఇన్‌స్పెక్టర్ నియామకం జరగలేదు. సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ అసెంబ్లీ ఎన్నికల ముందు మలక్‌పేట నుంచి బదిలీపై వచ్చారు. ఆయన వచ్చి ఐదు నెలలు కాకముందే బదిలీ చేయాలని ఉన్నతాధికారులపై ఒత్తిడి చేస్తున్నారు. సాధారణంగా రెండు సంవత్సరాలకు ఒకసారి ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తుంటారు. కానీ గత పాలకుల ఆశీస్సులతో పోస్టింగ్‌లు సాధించారన్న నెపంతో సరూర్‌నగర్, ఎల్బీనగర్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేయాలని ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తుంది. హయత్‌నగర్, ఎల్బీనగర్ స్టేషన్ల కోసం ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు పావులు కదుపుతున్నట్లు తెలుస్తుంది. సరూర్‌నగర్ ఇప్పటికే ఫైనల్ అయినట్లు సమాచారం. ఈ మూడు పోలీస్‌స్టేషన్లలో కనీసం రెండింటిని ఓ సామాజిక వర్గానికి చెందిన వారికే ఇవ్వాలని అధికార పార్టీ నేత ప్రభుత్వ పెద్దలపై ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. పైరవీలకు తావులేకుండా సమర్థులైన అధికారులకు పోస్టింగ్‌లు ఇస్తామని, పైరవీలు చేసిన వారికి లూప్‌లైన్లు తప్పవని స్వయానా ముఖ్యమంత్రి ప్రకటించినా ప్రయోజనం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు

● రేపటి నుంచి గుజరాత్‌లో పోటీలు


జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికైన నవీన్‌కుమార్, ధనలక్ష్మిని అభినందిస్తున్న హెడ్మాస్టర్ అర్జున్, సిబ్బంది

సరూర్‌నగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బాలాపూర్ మండలంలోని బడంగ్‌పేట్ జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు గుజరాత్‌లో జరుగనున్న జాతీయస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికయ్యారు. గత నెల జనవరిలో సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ సెలెక్షన్స్‌లో సదరు విద్యార్థులను ఎంపిక చేశారు. హైజంప్ అండర్-16 బాలుర విభాగంలో పదో తరగతి విద్యార్థి లస్కర్ నవీన్‌కుమార్, లాంగ్‌జంప్ అండర్-16 బాలికల విభాగంలో కేతావత్ ధనలక్ష్మి సెలెక్టర్లు ఎంపిక చేశారని బడంగ్‌పేట్ జడ్పీహెచ్‌ఎస్ హెడ్మాస్టర్ కోరని అర్జున్ తెలిపారు. గురువారం వారిద్దరినీ గుజరాత్‌కు పంపిస్తామని ఆయన చెప్పారు. బుధవారం స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెడ్మాస్టర్ అర్జున్‌తోపాటు స్కూల్ సిబ్బంది కలిసి విద్యార్థులను అభినందించి, వారికి స్పోర్ట్స్ కిట్‌లను బహూకరించారు.

వైభవంగా త్రిశక్తి దేవాలయ వార్షికోత్సవం

వనస్థలిపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్ర జ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ హరిహరపురం కాలనీలోని ప్రసిద్ధ త్రిశక్తి దేవాలయ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ వేడుకలకు బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ దంపతులు మొద్దు లచ్చిరెడ్డి, కవిత హాజరై అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ నారాయణరెడ్డి, కోశాధికారి రవీందర్‌కుమార్, మురళీకృష్ణ, రంగనాథం తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తిచేస్తాం : మేయర్

సరూర్‌నగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని డివిజన్లలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి తెలిపారు. బుధవారం ఆమె బాలాపూర్ 18వ డివిజన్‌లోని శ్రీగణేశ్‌కాలనీలో జరుగుతున్న సీసీరోడ్డు పనులను కార్పొరేటర్ బండారి మనోహర్‌తోకలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు.

లెప్రసీ ఫ్రీ ఇండియా కోసం కృషి

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో 2027 సంవత్సరంలోగా లెప్రసీ ఫ్రీ ఇండియా కోసం కృషి చేస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర నాయక్ తెలిపారు. హిందూ కుష్ఠు నివారణ సంఘం వైస్ చైర్మన్ టీవీ. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నగర శివారు పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్‌లో కుష్ఠువ్యాధి నిర్మూలన పక్షోత్సవాల ముగింపు వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హెల్త్ డైరెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్ఠు వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి మందులను వాడితే తగ్గిపోతుందన్నారు. టీవీ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కుష్ఠు బాధితులకు మానవతా దృక్పథంతో అన్ని విధాలుగా సహకరించాలన్నారు. ఈ సందర్భంగా రవీంద్రనాయక్ దుప్పట్లను పంపిణీ చేశారు. లెప్రసీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జాన్‌బాబు, రంగారెడ్డి, హైదరాబాద్ అడిషనల్ డీఎంహెచ్‌ఓలు డాక్టర్ అరుణ, డాక్టర్ నిర్మల, ప్రభావతి, శివానందహోం, సీఈవో అనంతరెడ్డి, స్లాప్ రాష్ట్ర అధ్యక్షుడు మనియాద రమేష్, ఏపీఎంఓలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి

మన్సూరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌యాదవ్ బుధవారం నగర మేయర్ గద్వాల విజయలక్ష్మీ, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్‌ను బుధవారం కలిశారు. డివిజన్‌లోని పలు సమస్యలను వివరించిన కార్పొరేటర్, అభివృద్ధిపనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

'రామచంద్ర మిషన్' సేవలు అమోఘం

● కేంద్రమంత్రి దేవుసింగ్ జెసింగ్‌భాయ్ చౌహాన్

నందిగామ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రామచంద్ర మిషన్ సంస్థ దేశవ్యాప్తంగా చేపడుతున్న సేవలు అమోఘమని, ఆ సంస్థ చేపట్టే కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని కేంద్రమంత్రి దేవుసింగ్ జెసింగ్‌భాయ్ చౌహాన్ అన్నారు. రామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ రెండో గురువు బాబూజీ మహరాజ్ జయంతితో పాటు సంస్థ ఆదిగురువు లాలాజీ మహరాజ్ జయంత్యుత్సవాలు రంగారెడ్డి జిల్లా నందిగామ మండల పరిధిలోని కన్హా శాంతివనంలోని ప్రపంచంలోని అతిపెద్ద ధ్యాన కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూజీ మహరాజ్ పేరుతో పోస్టల్ స్టాంప్‌ను కేంద్రమంత్రి, రామచంద్ర మిషన్‌గురూజీ, పద్మభూషణ్ అవార్డు గ్రహీత కమలేష్ డి పటేల్(దాజీ)తో కలిసి విడుదల చేశారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

కొత్తపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ పరిధి ఆర్టీసీ కాలనీ మజీద్‌లేన్‌లో ఓ వ్యక్తి భవనం 3వ అంతస్తుపై నుంచి కింద పడి మృతి చెందాడు. ఎస్ఐ మధు కథనం ప్రకారం.... నల్లగొండ జిల్లా శ్రీనగర్‌కాలనీకి చెందిన కీసర వెంకట్(30) అనిత దంపతులు. నెలన్నర క్రితం నగరానికి వచ్చి ఆర్టీసీ కాలనీ మజీద్‌లేన్‌లో ఉంటున్నారు. వెంకట్ కారుడ్రైవర్. బుధవారం మధ్యాహ్నం అతడు బయటి నుంచి వచ్చి భవనం 3వ అంతస్తు నుంచి కిందకు పడిపోయి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. అప్పు తీర్చాలని తన భర్తను రెండు రోజులుగా మల్లేష్, నవీన్, నవీన్‌కుమార్ వేధిస్తున్నారని అనిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఉదయం నుంచి ఆ ముగ్గురు వ్యక్తులు వెంకట్‌ను అప్పుతీర్చాలని ఒత్తిడి చేశారని, దాడి చేశారని ఆమె పేర్కొంది. వాళ్లే తన భర్తను 3వ అంతస్తు నుంచి తోసేశారని ఆమె ఆరోపించింది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పుల్వామా అమరులకు నివాళి

ఎల్బీనగర్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పుల్వామా అమరులకు నివాళులర్పిస్తూ తెలంగాణ మాజీ కేంద్ర సాయుధ పోలీసు ఫోర్సెస్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ఎల్బీనగర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఎల్బీనగర్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం నుంచి కొత్తపేటలోని రంగారెడ్డి జిల్లా పాత కోర్టుల కాంప్లెక్స్ వరకు వీర జవానుల కుటుంబాల త్యాగాలను స్మరించుకుంటూ ర్యాలీ వచ్చి, అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా తెలంగాణ మాజీ కేంద్ర సాయుధ పోలీసు ఫోర్సెస్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె.శ్యామ్‌సుందర్‌రెడ్డి మాట్లాడుతూ పుల్వామా దాడులే కాకుండా దేశంలో మరెన్నో సంఘటనలలో సీఏపీఎఫ్‌కు చెందిన జవానులు అమరులు అవుతూనే ఉన్నారన్నారు. అయినప్పటికీ ప్రభుత్వాలు వారి కుటుంబాలను పట్టించుకోవడంలేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటివరకు సీఏపీఎఫ్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయలేదన్నారు. తెలంగాణలోని 15 వేల మంది మాజీ సీఏపీఎఫ్ సిబ్బంది, 15 వేల మంది సర్వీస్ సిబ్బంది సౌకర్యాల లేమితో అవస్థలు పడుతున్నారన్నారు.

జీహెచ్‌ఎంసీలో కదిలిన కుర్చీలు

పాతుకుపోయినవారికి స్థానచలనం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీలో ఎన్నోఏళ్లుగా పాతుకుపోయిన డిప్యూటీ కమిషనర్లకు స్థాన చలనం కలిగింది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మున్సిపల్ శాఖ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కమిషనర్లను బదిలీలు చేయగా, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ ఒకే స్థానంలో ఏళ్లతరబడి ఉన్న పది మందిని బదిలీ చేశారు. వారి స్థానంలో ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారిని నియమించారు. ఏశైలజ, ఎండీ షేక్, డీ.సుభాష్‌రావులకు పోస్టింగ్ ఇవ్వలేదు.

పేరు	ప్రస్తుతం పని చేస్తున్న స్థానం	బదిలీ అయిన స్థానం
జకీయ సుల్తానా	డిప్యూటీ సీఈఓ	సర్కిల్-4, ఎల్బీనగర్ డిప్యూటీ కమిషనర్
ఎ.సుజాత	సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్	సర్కిల్-5, సరూర్‌నగర్ డిప్యూటీ కమిషనర్
సీహెచ్.నాగేశ్వరరావు	రామగుండం, మున్సిపల్ కమిషనర్	సర్కిల్-12, మెహిదీపట్నం డిప్యూటీ కమిషనర్
జి.వేణుగోపాల్ రెడ్డి	బోడుప్పల్, మున్సిపల్ కమిషనర్	సర్కిల్-29, సికింద్రాబాద్ డిప్యూటీ కమిషనర్
శివకుమార్	డిప్యూటీ కలెక్టర్, విజిలెన్స్, జీహెచ్‌ఎంసీ	సర్కిల్-7, సంతోష్‌నగర్ డిప్యూటీ కమిషనర్
ఎస్.విద్యాధర్	గజ్వేల్, మున్సిపల్ కమిషనర్	సర్కిల్-14, గోషామహల్ డిప్యూటీ కమిషనర్
వి.సమ్మయ్య	తెల్లాపూర్, డిప్యూటీ కమిషనర్	సర్కిల్-30, బేగంపేట డిప్యూటీ కమిషనర్
ఖాదర్ మొయినుద్దీన్	వెయిటింగ్	సర్కిల్-15, ముషీరాబాద్ డిప్యూటీ కమిషనర్
తిప్పర్తి యాదయ్య	ముషీరాబాద్ డిప్యూటీ కమిషనర్	సర్కిల్-3, హయత్‌నగర్ డిప్యూటీ కమిషనర్
జి.అంజనేయులు	డిప్యూటీ కమిషనర్, జీహెచ్‌ఎంసీ	సర్కిల్-2, ఉప్పల్ డిప్యూటీ కమిషనర్
టి.దశరథ	సర్కిల్-4, ఎల్బీనగర్ డిప్యూటీ కమిషనర్	జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు అటాచ్
పి.రవీందర్‌కుమార్	సర్కిల్-3, హయత్‌నగర్ డిప్యూటీ కమిషనర్	జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు అటాచ్
సీహెచ్.అరుణకుమారి	సర్కిల్-5, సరూర్‌నగర్ డిప్యూటీ కమిషనర్	జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు అటాచ్
ఎ.నాగమణి	సర్కిల్-7, సంతోష్‌నగర్ డిప్యూటీ కమిషనర్	జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు అటాచ్


జువెలర్స్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న సంస్థ ఎండీ నరసింహారెడ్డి

కొత్తపేటలో ముకుంద జువెలర్స్ ప్రారంభం


బ్రాంచిని ప్రారంభిస్తున్న సంస్థ డైరెక్టర్ నిఖితారెడ్డి

ఎల్బీనగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కొత్తపేటలో ముకుంద జ్యువెలర్స్ మొట్టమొదటి జువెలర్ ఫ్యాక్టరీ ఔట్‌లెట్‌ను సంస్థ ఎండీ నరసింహారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు ప్రకటించారు. వినియోదారులు ఎంత బంగారం కొంటే అంత వెండి ఉచితమని, అదేవిధంగా మేకింగ్ చార్జీలు మినహాయింపు, వీఏ 2-12 శాతం మాత్రమేనని సంస్థ ప్రతినిధులు తెలిపారు. కేపీహెచ్‌బీ, ఖమ్మంలలో తమ సంస్థ బ్రాంచిలను ప్రారంభించామని తాము ఊహించిన దానికంటే ఎక్కువ సక్సెస్ కావడంతో కొత్తపేటలో మరో బ్రాంచ్‌ను ప్రారంభించడం జరిగిందని ఎండీ నరసింహారెడ్డి తెలిపారు. మరిన్ని బ్రాంచిలను కూడా ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ నిఖితారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


డ్రైనేజీ పైపులైన్ నిర్మాణం కోసం తీసుకొచ్చిన పైపులు

డ్రైనేజీ మురుగు నీటి నివారణకు చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

దిల్‌సుఖ్‌నగర్, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): చైతన్యపురి మెట్రో స్టేషన్ నుంచి జీహెచ్‌ఎంసీ ఈస్ట్ జోనల్ కార్యాలయానికి వెళ్లే ప్రధాన రహదారికి కూతవేటు దూరంలో డ్రైనేజీ నీరు మూడు నెలలుగా పొంగిపొర్లుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని 'మురుగు....పరుగు..!' పేరిట మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన కథనంతో జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించారు. పొంగిపొర్లుతున్న డ్రైనేజీ మ్యాన్‌హోల్‌ను అధికారులు పరిశీలించారు. గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి వెంటనే మ్యాన్‌హోల్ నిర్మాణ పనులను చేపట్టాలని అధికారులకు సూచించారు. దీంతో మ్యాన్‌హోల్‌ను నిర్మించేందుకు కాంట్రాక్టర్ పైపులు, నూతన మ్యాన్‌హోల్ మూతలను తీసుకొచ్చారు. త్వరలోనే పనులను పూర్తిచేసి మురుగు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

రాత్రి అదృశ్యం.. ఉదయం నాలాలో మృతదేహం

బంజారాహిల్స్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఇంటిముందు ఆడుకుంటున్న బాలుడు రాత్రి అదృశ్యమయ్యాడు. మరుసటి రోజు సమీపంలోని ఓ నాలాలో మృతదేహం లభించింది. జూబ్లీహిల్స్ రోడ్డు నం. 5 దుర్గాభవానీనగర్ బస్తీలో మునావత్ కవిత, రమేష్ దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు ఎం.కార్తిక్(11) జవహర్‌నగర్‌కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 13న బస్తీలో పిల్లలతో కలిసి కార్తిక్ ఆడుకుంటూ రాత్రి 8 గంటల తరువాత కనిపించకుండా పోయాడు. బాలుడి ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు మొదలు పెట్టారు. బుధవారం ఉదయం బస్తీకి ఆనుకొని ఉన్న జీహెచ్‌ఎంసీ పార్కులో నుంచి వెళుతున్న నాలాలో పరిశీలించగా కార్తిక్ మృతదేహం లభించింది. అనుమానాస్పద మృతికింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జూబ్లీహిల్స్ హత్య కేసు.. పోలీసుల అదుపులో రౌడీషీటర్

బంజారాహిల్స్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రియాల్టర్, బీజేపీ నాయకుడు సింగోడి రాము హత్య కేసులో కీలకంగా వ్యవహరించిన రౌడీషీటర్ జిలానీని పశ్చిమ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. రాముపై పగతో మణికంఠ హత్య చేసేందుకు పథకం వేయగా రౌడీషీటర్ జిలానీ తన మనుషులతో పాల్గొన్నాడు. హత్య అనంతరం జిలానీ అక్కడి నుంచి పారిపోయాడు. అతని మనుషులు మాత్రం పోలీసులకు దొరికారు. గతంలో కూడా అనేక హత్య కేసుల్లో నిందితుడిగా ఉన్న జిలానీని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ హత్యలో ఏ8గా ఉన్న జీడిమెట్లకు చెందిన గణపతిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

పట్టపగలే నగల షాపులో భారీ దోపిడీ

● రూ.20 లక్షల విలువైన నగలను ఎత్తుకెళ్లిన ముగ్గురు

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్లాన్ ప్రకారం బంగారు గొలుసు కావాలంటూ నగల షాపునకు వచ్చిన దుండగులు.. షాపులోని వ్యక్తిపై కత్తితో దాడి చేసి రూ.20 లక్షల విలువ చేసే ఆభరణాలను ఎత్తుకెళ్లారు. హైదరాబాద్ మలక్‌పేట అక్బర్‌బాగ్‌లోని కిస్వాహ్ నగల దుకాణంలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. షాపు యజమాని మహ్మద్ ఉర్ రెహమాన్ పని మీద బయటికెళ్తూ తన కుమారుడు సజా ఉర్ రెహమాన్ (22)ను షాపులో కూర్చొబెట్టాడు. ఈ క్రమంలోనే మధ్యాహ్నం 1.30 గంటలకు ఓ వ్యక్తి వచ్చి బంగారు గొలుసు కావాలని అడిగాడు. దీంతో సజా ఉర్ రెహమాన్ గొలుసు చూపించే పనిలో ఉండగా.. మరో ఇద్దరు వ్యక్తులు ముసుగులు ధరించి షాపులోకి వచ్చారు. ఇందులో ఒకరు సజా ఉర్ రెహమాన్‌పై కత్తితో దాడికి దిగగా.. అతడు చెవి, మెడకు గాయం కావడంతో కింద పడిపోయాడు. దీంతో షాపులోని బంగారు నగలను సర్ది సంచిలో వేసుకుని, బయటికి వచ్చి ముగ్గురు ఒకే బైక్‌పై పారిపోయారు. షాపు యజమాని మహ్మద్ ఉర్ రెహమాన్ చాదర్‌ఘాట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాయపడిన సజా ఉర్ రెహమాన్ పరిస్థితి నిలకడగానే ఉందని పోలీసులు తెలిపారు. ఇటు సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ జానకీ ధరావత్ హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్నారు. చోరీకి పాల్పడిన తీరు, దొంగల వివరాలను ఆరా తీశారు. వెంటనే క్లూస్ టీమ్‌ను రంగంలోకి దింపారు. దొంగలను పట్టుకోడానికి నాలుగు టీమ్‌లను రంగంలోకి దింపినట్లు సమాచారం.

కారు ఢీకొని చార్మినార్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మృతి

● నారాయణగూడ ఎక్సైజ్ ఎస్ఐకి గాయాలు


చికిత్స పొందుతున్న ఎస్ఐ ఖాజా వలి మొయినుద్దీన్


ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ సాదిక్‌అలీ (ఫైల్)

కొత్తపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్‌లో మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చార్మినార్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ సాదిక్‌అలీ(40) మృతి చెందగా, నారాయణగూడ ఎక్సైజ్ ఎస్ఐ ఖాజా వలి మొయినుద్దీన్(52)కు గాయాలయ్యాయి. ఎల్బీనగర్ ఎస్ఐ దయాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... నకిరేకల్‌కు చెందిన మహ్మద్ సాదిక్‌అలీ మలక్‌పేట ఏ- బ్లాక్ క్వార్టర్స్‌లో ఉంటూ చార్మినార్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. నారాయణగూడ ఎక్సైజ్ ఎస్ఐ ఖాజావలి మొయినుద్దీన్ కూడా ఏ- బ్లాక్‌లోనే ఉంటున్నారు. ఇద్దరూ కలిసి మంగళవారం రాత్రి బైక్‌పై ఎల్బీనగర్‌లో ఓ ఫంక్షన్‌కు వెళ్లి 11.40 గంటలకు తిరిగి బైకుపై మలక్‌పేటకు బయలుదేరారు. సరూర్‌నగర్ స్టేడియం వద్ద హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలోకి రాగానే ఎదురుగా వేగంగా వస్తున్న కారు వారి బైకును ఢీకొట్టింది. బైకు నడిపిన సాదిక్ అలీకి తీవ్ర గాయాలయ్యాయి, వెనుక కూర్చున్న ఖాజావలీకి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సాదిక్‌అలీ, ఖాజావలీలను 108 వాహనంలో ఎల్బీనగర్ కామినేని ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును స్వాధీనం చేసుకున్నారు. సీఐ సాదిక్‌అలీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తెలిపారు. ఎస్ఐ ఖాజావలి చికిత్స పొందుతున్నారు. మృతుడి సోదరుడు ఎండీ అబ్దుల్ అలీ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే కారు డ్రైవర్ పరారయ్యాడు.